

శరణు శరణు మల్లన్న

ఓదెల: ఓదెల మల్లన్న సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి పట్నాలతో పాటు బోనం, కోడె మొక్కులు చెల్లించుకున్నారు.



క్రేజీ కోర్సు.. ఫుడ్ సైన్స్

యువత, విద్యార్థులు తమ అభిరుచి మార్చుకుంటూ నూతన రంగాలపై దృష్టిసారిస్తున్నారు. శాతవాహన యూనివర్సిటీలోని ఫుడ్ కోర్సులో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం 39.0/29.0

వాతావరణం

ఆకాశం ఉదయం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రహదారి పనులు త్వరగా పూర్తి చేయండి



పనులు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధిలోని బన్నెచెరువు నుంచి మండలంలోని ఖానాపూర్ వరకు చేపట్టిన బీటి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. ఆదివారం రహదారి నిర్మాణ పనులు పరిశీలించారు. రహదారి సక్రమంగా లేక రైతులు చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రోడ్డు నిర్మాణానికి నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. వర్షాకాల సీజన్‌లో పంట పొలాలకు రైతులు వెళ్లేలా సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

నేడు 2కే రన్

పెద్దపల్లిరూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సోమవారం పెద్దపల్లిలో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో ఉదయం ఆరు గంటలకు ప్రారంభమయ్యే 2కే రన్‌లో కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, డీసీపీ వైభవ్ గైక్వాడ్‌లు పాల్గొంటారని అన్నారు. ఐటీఐ నుంచి కాలేజీ మైదానం వరకు జరిగే రన్‌లో నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొనాలని కోరారు.

బూత్‌స్థాయి నుంచి పార్టీని పటిష్టపరుద్దాం

పెద్దపల్లిరూరల్: కేంద్రంలో నరేంద్రమోదీ సారథ్యంలోని ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సేవలను వివరిస్తూ పార్టీని బూత్‌స్థాయి నుంచి పటిష్ట పరుద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆదివారం పెద్దపల్లిలో ముఖ్య నాయకులతో నిర్వహించిన బైఠక్‌లో మాట్లాడారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో పెద్దపల్లి గడ్డపై కాషాయ జెండా ఎగరేద్దామని, అందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. బూత్‌స్థాయి నుంచి గడపగడపకు తిరుగుతూ మోదీ పాలనలో సాధించిన విజయాలను గ్రామానికి అందిన నిధులను వివరించాలని సూచించారు. నాయకులు దాడి సంతోష్, తంగెడ రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు, రమేశ్, కృష్ణమూర్తి, తివారీ, రవీందర్‌రావు, నారాయణరావు, రాజన్న, సోడాబాబు, కందుల సదానందం, రాజం మహంతకృష్ణ, శ్రీకాంత్, ఉప్పుకిరణ్, రాజేంద్రప్రసాద్, నాగరాజు, సతీశ్, ఫయాజ్, ప్రభాకర్, లక్ష్మణ్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.



రామగుండంలోని గ్రంథాలయంలో అన్నీ సమస్యలే. ఈ లైబ్రరీ జెన్‌కో సంస్థ కేటాయించిన ఓ షెడ్‌లో నడుస్తోంది. అధికారి లేక స్వీపరే లైబ్రేరియన్ అవతారమెత్తాడు. ఇక వానాకాలం వచ్చిందంటే వర్షపు నీరు అంతా వరదలా రావడంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. లైబ్రరీలో పాఠకులకు కనీస వసతులేవు.

లైబ్రరీ సేవలు అంతంతే

- ఆరు గ్రంథాలయాలకే సొంత భవనాలు
- కొత్తగా ఏర్పాటైన మండలాల్లో జాడలేని లైబ్రరీలు

పెద్దపల్లిరూరల్: పాఠకులకు విజ్ఞానం అందించే గ్రంథాలయాలు అంతంత మాత్రంగానే సేవలందిస్తున్నాయి. శిథిలావస్థకు చేరిన, అద్దెభవనాల్లో నిర్వహిస్తున్న లైబ్రరీలతో పాఠకులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, పాలకమండలి సభ్యులు జిల్లాలోని ఆరు (పెద్దపల్లి, జూలపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్, ధర్మారం) గ్రంథాలయాలను రూ.3.10 కోట్లల వ్యయ అంచనాలతో కొత్తగా నిర్మించేందుకు చర్యలు చేపట్టడంపై పాఠకుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. అత్యధికంగా పాఠకులు వచ్చే గోదావరిఖనిలోని లైబ్రరీ అద్దె ప్రాతిపదికన సింగరేణి సమకూర్చిన పాత భవనంలో నడుస్తోంది. అంతర్గాం, పాలకుర్తి మండలాల్లో లైబ్రరీల ఏర్పాటుకు నోచుకోలేదు.



ఆదాయమున్నా సౌకర్యాలు సున్నా

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని గ్రంథాలయానికి ఏటా రూ.80లక్షల వరకు లైబ్రరీ సెస్ రూపంలో ఆదాయం అందుతున్నా పాఠకులకు కనీస వసతులు కల్పించలేకపోతున్నారు. సింగరేణిలో మూసి ఉంచిన డిస్పెన్సరీ గదిని అద్దె ప్రాతిప్రదికన తీసుకుని లైబ్రరీ నిర్వహిస్తున్నారు. పాలకులు పట్టించుకుని గోదావరిఖనిలోనూ గ్రంథాలయానికి సొంత భవనాన్ని అన్ని సౌకర్యాలతో నిర్మించాల్సిన అవసరముంది.



కాల్వశ్రీరాంపూర్‌లో అటెండరే అధికారి

కాల్వశ్రీరాంపూర్ మండలకేంద్రంలోని లైబ్రరీ భవనం శిథిలావస్థకు చేరింది. అటెండరే ఇక్కడి లైబ్రరీతో పాటు పక్కనే ఉన్న ఓదెల మండలానికి ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరిస్తున్నారు. లైబ్రరీకి వచ్చే పాఠకులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేవు. అయితే మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో కొత్తగా లైబ్రరీ భవనాన్ని రూ.40లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే పాఠకుల ఇబ్బందులు తీరనున్నాయి.



ఓదెల మండల కేంద్రంలో గ్రంథాలయం 35 ఏళ్లకు పైగా అద్దె భవనంలో అరకొరవసతుల నడుమ నడుస్తోంది. ఈ ప్రాంత విద్యావంతులు పోటీ పరీక్షల కోసం అవసరమైన మెటీరియల్ అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు. ఇక ఇక్కడి లైబ్రరీని కూడా అటెండర్ నిర్వహిస్తున్నాడు. ఓదెలలోని జెడ్పీహైస్కూల్ ఆవరణలోనే కొత్త గ్రంథాలయ భవనాన్ని రూ.40లక్షలతో చేపట్టాలని నిర్ణయించడంతో ఇంతకాలం పడ్డ అద్దెభవనం బాధలు తొలగనున్నాయి.



జిల్లా కేంద్రం పెద్దపల్లిలో గ్రంథాలయానికి సొంత భవనాన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో రూ.కోటి వ్యయ అంచనాలతో నిర్మించనున్నారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ ఆవరణలో లైబ్రరీ పనిచేస్తోంది. ఇక్కడ యువత పోటీపరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. రేయింబవళ్లు తెరిచి ఉంచడంతో పాటు అల్పాహారం, భోజనం కూడా మున్సిపాలిటీ వారి సహకారంతో సమకూర్చుతున్నారు. గ్రంథాలయానికి సొంత భవనం అందుబాటులోకి వస్తే మరింత సౌకర్యవంతంగా ఉంటుంది.

సమస్యలను అధిగమిస్తున్నాం



జిల్లాలోని గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆరు లైబ్రరీలకు సొంతభవనాల పనులను వచ్చే నెలలో ప్రారంభిస్తాం. సిబ్బంది కొరతను తీర్చాలని, కొత్త మండలాలకు లైబ్రరీలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం. వీలైనంత మేరకు లైబ్రరీ ద్వారా పాఠకులకు మెరుగైన సేవలు అందించేందుకు పాటుపడుతున్నా. – రఘువీర్‌సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు



‘బడి’కెళ్దాం..

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- 63 హైస్కూళ్లలో డిజిటల్ బోధన
- పూర్తికాని ‘మన ఊరు–మనబడి’ పనులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పాఠశాలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 549 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 361 ప్రాథమిక పాఠశాలలు, 83 ప్రాథమికోన్నత, 105 ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రభుత్వం ఆయా పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టి బడీడు పిల్లలకు బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకున్నారు.

అసంపూర్తిగా మన ఊరు..మనబడి పనులు

ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని చేపట్టింది. తొలివిడతగా 191 పాఠశాలలను ఎంపిక చేసినా పనులు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఇప్పటివరకు 17 పాఠశాలల్లో పనులు పూర్తికాగా మరో 20 నుంచి 30 పాఠశాలలను ఈనెల 20న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

మెరుగైన వసతులు కల్పించాం

ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి వసతులను మెరుగు పర్చాం. మన ఊరు మన బడి పనులు చాలా వరకు పాఠశాలల్లో చివరి దశలో ఉన్నాయి. సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య ఉచితంగా అందుతుందని బడిబాట కార్యక్రమంలో వివరించి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకున్నాం.

–మాధవి, జిల్లా విద్యాధికారి, పెద్దపల్లి

63 హైస్కూళ్లలో డిజిటల్ బోధన

జిల్లాలోని 63 ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు డిజిటల్ బోధన అందుబాటులోకి వచ్చింది. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులను కల్పించారు. గ్రీన్‌చాక్‌బోర్డులు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఆధునిక ఫర్నీచర్‌ను అందుబాటులోకి తెచ్చారు.

స్వీపర్ల కొరత

పాఠశాలలను శుభ్రపర్చడం, మరుగుదొడ్లను శుభ్రపర్చే స్వీపర్లు, స్కావెంజర్ల సమస్య ఉంది. పంచాయతీలు, మున్సిపాలిటీలు సిబ్బంది సమకూర్చాలని ఉన్నతాధికారులు ఆదేశించినా అమలు అంతంతగానే ఉందని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను సిద్ధం చేసి నీటివసతి కూడా కల్పించామని అధికారులు పేర్కొంటున్నారు.

అన్నిరంగాల్లో మనమే ఆదర్శం

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్
- పెద్దపల్లిలో సాహిత్య దినోత్సవం



కవులు, రచయితలను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: పోరాడి సాధించుకున్న తెలంగాణలో దశాబ్ది పాలనలో గణనీయమైన అభివృద్ధిని సాధించుకుని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని జెడ్పీచైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. పెద్దపల్లి పట్టణ శివారులోని రంగంపల్లిలో ఆదివారం నిర్వహించిన సాహిత్య దినోత్సవంలో పాల్గొని పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కవులు, కళాకారులు, రచయితలు ఎంతో స్ఫూర్తినిచ్చారన్నారు. ఈనెల 22 వరకు జరిగే ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. కలెక్టర్ సంగీత మాట్లాడుతూ సాహిత్య దినోత్సవంలో పాల్గొనేందుకు ఉత్సాహవంతులైన కవులు, రచయితలు ముందుకొచ్చారని అన్నారు. తెలంగాణ అస్థిత్వం, ప్రగతి అంశాలపై 36మంది కవులు తమ కవితలను పంపించారని తెలిపారు. రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకలు జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నాయన్నారు. రామగుండం ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ ఉద్యమసమయంలో కవులు, కళాకారులు పోషించిన పాత్ర వెలగట్టలేనిదని అన్నారు. ఉమ్మడి పాలనలో ఉన్న పరిస్థితులు, ఇప్పటి తెలంగాణ సాధించిన అభివృద్ధిలో ఎంతో మార్పు ఉందన్నారు. ఈ సందర్భంగా కవితాపోటీల్లో పాల్గొన్న వారందరికీ నగదు ప్రోత్సాహకాలతో పాటు శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రఘువీర్‌సింగ్, జిల్లా అధికారులు శ్రీధర్, శివయ్య, రంగారెడ్డి, మాధవి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు ఖరారయ్యేనా..!?

- రేపు కార్మిక సంఘాలతో రిటర్నింగ్ అధికారి భేటీ
- హైదరాబాద్‌లో అన్ని సంఘాలతో సమావేశం
- సంఘాలకు లేఖ రాసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి

గోదావరిఖని: తెలంగాణాకు కొంగుబంగారంగా నిలిచిన సింగరేణి సంస్థలో గుర్తింపు ఎన్నికలపై కీలక సమావేశం మంగళవారం జరగనుంది. ఈనెల 13న ఉదయం 11గంటలకు హైదరాబాద్‌లోని కేంద్ర కార్మిక శాఖ కార్యాలయానికి సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలు హాజరు కావాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాస్ లేఖలు రాశారు. దీంతో ఈసారి గుర్తింపు సంఘం ఎన్నికలు ఖరారయ్యే అవకాశం ఉందని అంటున్నారు. సింగరేణిలో గుర్తింపు కాలపరిమితి ముగిసి నాలుగేళ్లు గడిచిందని వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఏఐటీయూసీ గతేడాది నవంబర్‌లో హైకోర్టును ఆశ్రయించింది. స్పందించిన హైకోర్టు మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని డిసెంబర్‌లో ఆదేశాలు జారీ చేసింది. దీనిపై మార్చిలో కోర్టుకు వెళ్లిన సింగరేణి యాజమాన్యం విద్యుత్ డిమాండ్ తీవ్రంగా ఉన్న వేసవికాలంలో ఎన్నికలు నిర్వహించలేమని, వినియోగదారులకు ఒప్పందం మేరకు బొగ్గు సరఫరా చేయాల్సి ఉంటుందని హైకోర్టుకు విన్నవించింది. బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపకుండా వర్షాకాలంలో నిర్వహించేందుకు సిద్ధమని తెలిపింది. దీంతో 2023 జూన్ 1 నుంచి మూడునెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో డిప్యూటీ చీఫ్‌లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు గత నెలలో అన్ని కార్మిక సంఘాలకు లేఖ రాశారు.

గతంలోనే ఎన్నికలకు సిద్ధమైన కార్మికశాఖ

మొదట్లో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు గతంలోనే కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు నిర్వహించాలని యాజమాన్యంతో పాటు సింగరేణి విస్తరించి ఉన్న అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాశారు. కార్మిక సంఘాలు కూడా ఎన్నికల విషయంలో తాము సిద్ధమని స్పష్టం చేశాయి. దీనిపై స్పందించిన సింగరేణి యాజమాన్యం కోర్టుకు వెళ్లి మార్చిలో ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని జూన్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపబోదని ఎన్నికలకు అంగీకారం తెలిపింది. దీనిపై కార్మిక సంఘాలు కూడా సానుకూలంగా స్పందించడంతో ఎన్నికలు జూన్‌కు వాయిదాపడ్డాయి.

ఎన్నికల గడువు పూర్తయి నాలుగేళ్లు

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల గడువు ముగిసి నాలుగేళ్లయ్యింది. 2017 అక్టోబర్ 5న గత గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో గెలిచిన తెలంగాణా బొగ్గు గని కార్మిక సంఘానికి రెండేళ్ల కాలపరిమితిగా లేఖను కేంద్ర కార్మిక శాఖ అందజేసింది. అధికారికంగా 2019 అక్టోబర్‌తో ఎన్నికల కాలపరిమితి ముగియాల్సి ఉంది. అయితే ఎన్నికల ముందు నాలుగేళ్లు ప్రకటించి ఎన్నికల తర్వాత రెండేళ్లకు కుదించడం ఏమిటని అభ్యంతరం తెలుపుతూ హైకోర్టుకు వెళ్లింది. కోర్టులో కేసు నడుస్తుండగానే కాలపరిమితి నాలుగేళ్లు గడిచిపోయింది. నాలుగేళ్ల లెక్కన 2021 అక్టోబర్‌తో కాలపరిమితి ముగియాల్సి ఉంది. కానీ దేశంలో కోవిడ్ విజృంభించడంతో తాము ఎన్నికలు నిర్వహించలేమని జిల్లా కలెక్టర్లు చేతులెత్తేశారు. దీంతో మరో 20నెలలు గడిచి పోయింది.

రేపటి సమావేశం కీలకం..

సాధారణ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్న క్రమంలో సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు కేంద్ర కార్మిక శాఖ సమాయత్తం కావడం చర్చనీయాంశంగా మారింది. సింగరేణి సంస్థలో గుర్తింపు ఎన్నికలపై మంగళవారం జరుగనున్న సమావేశం కీలకం కానుంది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, భూపాల్‌పల్లి, పెద్దపల్లి, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ ఇలా ఏడు జిల్లాల్లో సింగరేణి విస్తరించి ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో బొగ్గు గని కార్మికుల ఓట్లు కీలకంగా మారనున్నాయి. ఈక్రమంలో సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు సాధారణ ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో సింగరేణి ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందా లేక వాయిదాపై ఆలోచిస్తుందా అనే చర్చ కార్మికుల్లో జోరుగా సాగుతోంది.

కాంగ్రెస్ గెలుపునకు కంకణబద్ధులు కావాలి



పార్టీలో చేరిన వారితో ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కంకణబద్ధులు కావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ అన్నారు. ఆదివారం దుర్గానగర్‌లోని ఆర్‌కే గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ముస్లింలకు విద్య, ఉద్యోగాల కల్పనలో 4శాతం రిజర్వేషన్లు పెంచి వారి కుటుంబాల్లో వెలుగులు నింపామన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి 9 శాతమే ఇచ్చి మోసం చేసిందన్నారు. దీనికి ముందు పార్టీ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ.నజీమ్ ఆధ్వర్యంలో 50వ డివిజన్‌కు చెందిన మైనారిటీ నాయకులు మొబీన్, గులాం ముస్తఫా, జకీర్, సైఫ్, ఇమ్రాన్‌తో పాటు పెద్ద సంఖ్యలో ముస్లింలు బైక్ ర్యాలీ నిర్వహించి పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహంకాళిస్వామి, ఎండీ.ముస్తఫా, మారెల్లి రాజిరెడ్డి, తాళ్లపెల్లి యుగేందర్, కొటం సతీశ్, ఫజల్ బేగ్, ఆబిద్, ధూళికట్ట సతీశ్, విజయ్, సాయికిరణ్, ఉదయ్, ఆరిఫ్, మార్క రాజు, శివ, సురేష్, ప్రవీణ్, అడప కృష్ణ, సోహైల్, సాయి, శంకర్, అశ్రఫ్, అరుణ్‌లతో పాటు అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేంద్రంలోకి వెళ్లేందుకు బారులు తీరిన అభ్యర్థులు



ప్రశాంతంగా గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష

- 2,314 మంది అభ్యర్థుల గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్/కమాన్‌పూర్/సుల్తానాబాద్/గోదావరిఖనిటౌన్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 6,067 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3,753 మంది (61.86శాతం) మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 2,314 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సంగీత, లైజర్ అధికారి జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, మంథని ఆర్డీవో వీరబ్రహ్మయ్యలు తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆలస్యంతో వెనక్కి..

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఉదయం 10:30 గంటలకు మొదలవుతుందని, 15 నిమిషాల ముందు వరకే గేటులోనికి అనుమతినిస్తామని అధికారులు ముందే ప్రకటించారు. అయితే పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోని పరీక్షా కేంద్రానికి సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లికి చెందిన చొప్పరి వెంకటేశ్ ఒక్క నిమిషం ఆలస్యంగా రావడంతో అధికారులు లోనికి అనుమతించలేదు. గోదావరిఖనిలో నలుగురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వెనక్కి పంపించారు. దీంతో తమ అసహనం వ్యక్తం చేశారు. నక్కల రవీందర్ అనే అభ్యర్థి తన హాల్‌టికెట్‌ను చింపి రోడ్డుపై విసిరాడు.



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సంగీత

క్లుప్తంగా

నూతన కార్యవర్గం

పెద్దపల్లిరూరల్: అఖిల భారత రైతుకూలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మేరుగు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా వెలుతురు సదానందం, ఉపాధ్యక్షులుగా కొల్లూరి మల్లేశ్, రాజమౌళి, సహాయ కార్యదర్శులుగా సాంబయ్య, రమేశ్, కోశాధికారిగా రాజకొమురయ్య, కార్యవర్గ సభ్యులుగా తిరుపతి, బాబు, బాబన్న, శంకర్, రాములు, బషీర్, రమేశ్, కుమారస్వామి ఎన్నికయ్యారు.

'ఐఎఫ్‌టీయూపై నిందలు మానుకోండి'



మాట్లాడుతున్న వెంకన్న

కమాన్‌పూర్(మంథని): సింగరేణి కాంట్రాక్టు కార్మికులను జేబీసీసీఐ సంఘాలు దగా చేస్తున్నాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న ఆరోపించారు. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–1 బేస్ వర్క్‌షాపులో ఆదివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. మే 19, 20 తేదీల్లో కోల్‌కతాలో జరిగిన 11వ వేతన చర్చల ఒప్పందంలో జేబీసీసీఐ సంఘాలతో ఎలాంటి మేలు జరగలేదన్నారు. తమ వల్లే మెరుగైన ఒప్పందం జరిగిందని గొప్పలు చెప్పుకుంటున్న ఆ సంఘాలు చేసిందేమీ లేదని పేర్కొన్నారు. ఐఎఫ్‌టీయూపై నిందలు వేయడం మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మనోజ్, నర్సయ్య, రమేశ్, రాజనర్సు, శ్రీనివాస్, సంపత్, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సురేష్ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన వడాల సురేష్(34) అనే సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడాల వెంకటేశ్వర్లుకు ముగ్గురు కుమారులు కాగా చిన్న కుమారుడు సురేష్ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తూ తల్లిదండ్రులతో ఉంటున్నాడు. అతనికి ఇంకా వివాహం కాలేదు. ఈ క్రమంలో కొంత కాలంగా మద్యానికి బానిసై, శనివారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి, ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు రిఫర్ చేయడంతో తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చొప్పదండి: పట్టణంలోని విజయానగర్ ఆబాదికి చెందిన సుధాకర్ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. సుధాకర్ కుటుంబ సభ్యులు హైదరాబాద్ వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి నగదు చోరీ చేసినట్లు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి రావాల్సి ఉండటంతో ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. వారం క్రితం కూడా పట్టణంలోని బాలాజీనగర్‌లో చోరీ ఉదంతం చోటు చేసుకుంది. వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది.

క్రేజీ కోర్సు.. ఫుడ్ సైన్స్

- రాష్ట్రంలో శాతవాహన యూనివర్సిటీలోనే అందుబాటులో..
- వర్సిటీ, పది ప్రైవేటు కాలేజీల్లో 350 సీట్లే
- విరివిరిగా ఉద్యోగ అవకాశాలు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



కోర్సులో భాగంగా ఆహార పదార్థాల తయారీని తెలుసుకుంటున్న విద్యార్థులు

కరీంనగర్ సిటీ: మారుతున్న కాలానికనుగుణంగా యువత, విద్యార్థులు తమ అభిరుచి మార్చుకుంటూ నూతన రంగాలపై దృష్టిసారిస్తున్నారు. సాధారణంగా చాలామంది వైద్య, ఇంజినీరింగ్, డిగ్రీ, విదేశాల్లో ప్రత్యేక కోర్సుల కోసం ప్రయత్నాలు చేస్తుండగా కొందరు కొత్త అవకాశాలను వెతికి పట్టుకొని, ఉన్నత ఉద్యోగాలు పొందుతున్నారు. కరోనా తర్వాత ఆరోగ్యం, ఆహార పదార్థాలపై విస్తృతమైన పరిశోధనలు జరుగుతున్నాయి. ఆయా రంగాల్లో అవకాశాలు విరివిరిగా లభిస్తున్నాయి. పలు కంపెనీలు భారీ వేతనంతో ఉద్యోగాలు ఇస్తున్నాయి. అటువంటి కోర్సుల్లో ఒకటే ఫుడ్ సైన్స్. మన రాష్ట్రంలో ప్రభుత్వ పరంగా ఇది కేవలం కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలోనే ఉంది.

వర్సిటీ అనుబంధ పది కాలేజీల్లో..

శాతవాహన యూనివర్సిటీ దాని అనుబంధ కాలేజీల్లో సైతం ఫుడ్ సైన్స్ పీజీ కోర్సులు నిర్వహిస్తున్నారు. దీంతో వివిధ జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రాల నుంచి విద్యార్థులు కరీంనగర్ వచ్చి, ఈ కోర్సులో చేరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 350(ఎస్‌యూలో 50, పది ప్రైవేటు కాలేజీల్లో 300) సీట్లు ఉండటంతో దీనికి డిమాండ్ ఏర్పడింది. కోర్సు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాలు తలుపు తడుతుండటం, ప్రభుత్వంలో ఉన్నతాధికారులుగా అవకాశాలు లభిస్తుండటంతో చాలామంది ఆసక్తి చూపుతున్నారని అధ్యాపకులు అంటున్నారు. ముఖ్యంగా ప్రైవేట్ రంగంలోని వివిధ విభాగాల్లో పెద్ద ఎత్తున ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వాలు కూడా ఆహార భద్రత విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తుండటం కలిసొచ్చే అంశం. ఈ కోర్సు చివరి ఏడాదిలో ఉండగానే కంపెనీలు విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నాయని సీనియర్ విద్యార్థులు చెబుతున్నారు. ప్రభుత్వం రంగంలో ఫుడ్‌సేఫ్టీ, ఎఫ్‌సీఐ ఆఫీసర్లు ఉద్యోగాలు ఉన్నాయి. పలు నగరాల్లో వివిధ ఆహార ఉత్పత్తుల సంస్థలు, డెయిరీల్లో ఉద్యోగాలు పొందవచ్చు. ఫలితంగా ఫుడ్ సైన్స్ కోర్సులో చేరడానికి హైదరాబాద్ నుంచి ఎక్కువ మంది విద్యార్థులు వస్తున్నారు.

హైదరాబాద్ నుంచి వచ్చా..



రాష్ట్రంలో ఎస్‌యూలో తప్ప మరెక్కడా ఫుడ్ సైన్స్ కోర్సు లేదు. అందుకే నేను హైదరాబాద్ నుంచి వచ్చి, ఇక్కడ చదువుతున్నాను. వివిధ కంపెనీల్లో మంచి ఉద్యోగ అవకాశాలున్నాయని స్నేహితుల ద్వారా తెలుసుకొని, ఈ కోర్సులో చేరా.

– సంధ్య, ఫుడ్ సైన్స్ విద్యార్థిని

ఫుడ్ ఇన్‌స్పెక్టరవుతా..



ఫుడ్‌సైన్స్ కోర్సు పూర్తి చేసి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా. ఈ కోర్సు కోసం చాలా మంది కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీకి వస్తున్నారు. సీట్లు తక్కువగా ఉండటంతో ఫుల్ డిమాండ్ ఉంది.

– ప్రేమ్‌సాగర్, ఫుడ్ సైన్స్ విద్యార్థి

విద్య మనిషి ప్రాథమిక హక్కు

- డ్రాయింగ్, టైలరింగ్, మ్యూజిక్ టీచర్ల పోస్టుల మంజూరుకు కృషి చేస్తా
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- ముగిసిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు



మంత్రి గంగుల, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లిల చిత్రాలను అందిస్తున్న అభ్యర్థి

సప్తగిరికాలనీ(కరీంనగర్): నూతన విద్యావిధానంలో అన్ని సబ్జెక్టులతోపాటు సమానంగా క్రాఫ్ట్, ఆర్ట్, డ్రాయింగ్, మ్యూజిక్ ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి, డ్రాయింగ్, టైలరింగ్, మ్యూజిక్‌కు సంబంధించిన టీచర్ల పోస్టుల మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. 42 రోజులుగా కరీంనగర్‌లోని ధన్గర్‌వాడీ పాఠశాలలో నిర్వహిస్తున్న టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు–2023 శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. విద్య మనిషి ప్రాథమిక హక్కు అని, అందరూ తప్పక వినియోగించుకొని, భవిష్యత్‌ను ఉన్నతంగా నిర్మించుకోవాలని సూచించారు. శిక్షణార్థులు గీసిన బొమ్మలు చూసి, వారిని అభినందించారు. డీఈవో జనార్దన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఈ శిక్షణ ఒక గొప్ప అవకాశమని అన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేయడానికి ఈ సర్టిఫికెట్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. శిక్షణార్థులు ఆటపాటలతో సందడి చేశారు. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్, బీఆర్‌ఎస్ నగర శాఖ అధ్యక్షుడు హరిశంకర్, కోర్సు డైరెక్టర్ శంకర్, కో–ఆర్డినేటర్ కోట లక్ష్మారెడ్డి, కేఎస్.అనంతాచార్య తదితరులు పాల్గొన్నారు.

మేధావుల సలహాలు సమాజానికి అవసరం





రాజేశ్వర్‌రావుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జవదేకర్, ఎంపీ సంజయ్, వారాలకు పుస్తకం అందిస్తూ..

- కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్
- మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రముఖులకు సత్కారం

కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌కల్చరల్: సమాజానికి మేధావుల సూచనలు ఎంతో అవసరమని, అలాంటి వారిని ప్రోత్సహించి, సత్కరించుకోవడం మనందరి బాధ్యత అని కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు ప్రకాశ్ జవదేకర్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌తో కలిసి కరీంనగర్‌లోని ప్రముఖ వ్యక్తులను ఆయన కలిశారు. కరీంనగర్ డెయిరీని విజయపథంలో నడిపిస్తున్న చల్మెడ రాజేశ్వర్‌రావు, సాహితీవేత్త, కవి, జాతీయ అవార్డు గ్రహీత వారాల ఆనంద్‌లను వారి ఇళ్లకు వెళ్లి, మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల ప్రధాని మోదీ ప్రభుత్వ విజయవంత పాలన సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రముఖులు, మేధావులు, వివిధ రంగాల్లో రాణించిన లక్ష మందిని కలిసి, సత్కరించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అలాగే సాహిత్య రంగానికి విశేష కృషి చేస్తున్న వారాల ఆనంద్‌ను కలవడం సంతోషకరంగా ఉందని పేర్కొన్నారు. ఆయనకు ప్రధాని మోదీ 20 ఏళ్లు అనే పుస్తకాన్ని బహూకరించారు. ఆనంద్ తాను రచించిన పుస్తకాలను మాజీ మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు గాజుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్–బీజేపీ ఫ్లెక్సీ వివాదం



ఫ్లెక్సీని తొలగిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గన్నేరువరం(మానకొండూర్): మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ అధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదం మరింత ముదిరింది. ప్రగతి నివేదన సభను నిర్వహించిన సమయంలో మండలంలో వివిధ అభివృద్ధి పనులపై ప్రశ్నిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఫొటోలపై రాంగ్ గుర్తు వేయడంతో ఆదివారం టీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మండల అధ్యక్షుడు గంప వెంకన్న, గ్రామ అధ్యక్షుడు మీసాల ప్రభాకర్ సంబంధిత ఫ్లెక్సీని తొలగించారు. దీంతో ఇరు పార్టీల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని వారిని అక్కడి నుంచి పంపించివేశారు.

బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి

మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించే క్రమంలో బీజేపీ నాయకులపై పరుష పదజాలంతో దూషించిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, గ్రామ అధ్యక్షుడు మీసాల ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్, నాయకులు సొల్లు అజయ్‌వర్మ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ నాయకులు దూషించడమే కాకుండా బెదిరింపులకు దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కోమిటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి క్లాంం వాసుదేవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి గుర్రాల వెంకట్‌రెడ్డి, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ వినోద్‌కుమార్, పుప్పాల రఘు, జలదీశ్వరాచారి, రాజు, సత్తయ్య, సుమిత్‌రెడ్డి, వెంకటేష్, మచ్చ మురళీకృష్ణ, హరీష్, పర్శరాములు, శ్రీధర్, అనిల్, హరీష్, విజయ్, సాయి గణేష్ పాల్గొన్నారు.

యాస్వాడలో అగ్ని ప్రమాదం



వ్యాపిస్తున్న మంటలు

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని యాస్వాడ గ్రామంలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాలు.. గుర్తు తెలియని వ్యక్తులు పొలంలోని గడ్డికి నిప్పంటించడంతో గాలికి మంటలు చెలరేగాయి. సుమారు 2 కిలోమీటర్ల మేర వ్యాపించాయి. దీంతో వ్యవసాయబావుల కరెంటు వైర్లు, పైపులు, ఎడ్లబండ్లు తగలబడ్డాయి. తాడి చెట్లకు సైతం మంటలు అట్టుకున్నాయి. అలాగే లోయర్ మానేరు వాగు పక్క వరకు మంటలు వ్యాపించడంతో మత్స్యకారులు వలలు, ఇతర సామగ్రి కాలిపోయాయి. రైతులు, గ్రామస్తులు అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. లక్షలో ఆస్తి నష్టం జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మాయ మాటలతో మభ్యపెట్టి..

- బైక్, రూ.11వేలు, ఫోన్ అపహరణ

జమ్మికుంట(హుజూరాబాద్): గుర్తు తెలియని వ్యక్తి పరిచయం చేసుకొని, మాయమాటలతో మభ్యపెట్టి చోరీకి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. పోలీసుల వివరాలు.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన కంకటి వెంకటేశ్ ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి తనది మంచిర్యాల అని వెంకటేశ్‌ను పరిచయం చేసుకున్నాడు. డీజిల్‌ను తక్కువ ధరకే పోయిస్తానని నమ్మబలికాడు. దీంతో వెంకటేశ్, సదరు వ్యక్తి జమ్మికుంటకు బైక్‌పై వచ్చారు. జమ్మికుంట హెచ్‌పీ బంక్ వద్ద కొద్ది సమయం పాటు గడిపారు. అనంతరం కొత్తపల్లి సమీపంలోని బంక్ వద్ద వెళ్లారు. ఈక్రమంలో వెంకటేశ్ బాత్‌రూంకు వెళ్లగా, గుర్తు తెలియని వ్యక్తి బాధితుడి బైక్‌తో పాటు అందులో ఉన్న రూ.11వేలు, సెల్ ఫోన్‌తో అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థలో సుమారు 3,500 మంది కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గత 9 నెలలుగా కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. అయినా యాజమాన్యం చర్చల పేరుతో కాలయాపన చేస్తూ సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం లేదని ఆరోపించారు. పర్మనెంట్ కార్మికులతో సమానంగా పని చేస్తున్నా యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వారి పోరాటానికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని పేర్కొన్నారు. కార్మిక సంఘాల జేఏసీతో చర్చలు జరిపి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకపోతే వామపక్ష, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి ఈ.నరేష్, నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిపై కారు బీభత్సం



బోల్తా పడిన కారు



గాయపడిన సతీశ్ కుటుంబసభ్యులు

- డివైడర్ పైనుంచి దూసుకెళ్లి, ట్రాలీని ఢీకొన్న వైనం
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి గాయాలు

తిమ్మాపూర్(మానకొండూర్): రాజీవ్ రహదారిపై ఓ కారు బీభత్సం సృష్టించింది. డివైడర్ పైనుంచి దూసుకెళ్లి, అవతలివైపు నుంచి వస్తున్న ట్రాలీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయపడ్డారు. ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గాండ్ల సతీశ్ తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు కారులో వస్తున్నాడు. అదే సమయంలో ఓ ట్రాలీ కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తోంది. సతీశ్ నిద్రమత్తు కారణంగా తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీ ఎస్బీఐ చౌరస్తా వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. డివైడర్ పైనుంచి దూసుకెళ్లి, అవతలి వైపు నుంచి వస్తున్న ట్రాలీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు బోల్తా పడటంతో లోపల ఉన్న నలుగురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ట్రాన్స్‌పోర్టు లేక.. ఇంటికి రాలేక

- గొర్రెల కోసం వెళ్లి, అనంతపురం జిల్లాలో రంగపేటవాసుల ఇబ్బందులు

మానకొండూర్: ప్రభుత్వం గొర్రెల యూనిట్లు అందజేసిందని, సంతోషంగా వాటిని తెచ్చుకుందామని ఇతర జిల్లాలకు వెళ్లిన మానకొండూర్ మండలం రంగపేట గ్రామ లబ్ధిదారులు ఐదు రోజులుగా నానా ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు.. రంగపేట గ్రామానికి చెందిన 24 మందికి ప్రభుత్వం గొర్రెల యూనిట్లు మంజూరు చేసింది. గొర్రెలను తెచ్చుకుందామని లబ్ధిదారులు అధికారులతో కలిసి మంగళవారం కడప జిల్లా వరకు చేరుకోగా, అక్కడ గొర్రెలు బాగాలేవని అనంతపురం జిల్లాకు వెళ్లారు. రెండు రోజులు గొర్రెలు ఎక్కడ బాగున్నాయో వెతికి తీసుకున్నారు. అయితే వాటికి ట్యాంగింగ్ చేసేందుకు ఐదు జిల్లాల నుంచి ఇద్దరే రావడంతో కొంత ఆలస్యం జరిగినట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. వచ్చిన ఆఫీసర్లకు ఓ ప్లానింగ్ అంటూ లేదని వాపోయారు. ట్యాగింగ్ పూర్తయి రెండు రోజులు అవుతుందని, గొర్రెలను తీసుకెళ్లేందుకు ఎలాంటి ట్రాన్స్‌పోర్టు లేకపోవడంతో అక్కడే ఉండాల్సి వస్తుందని, ఆరుబయట పడుకోవాల్సి వస్తుందని, నానా ఇబ్బందులు పడుతున్నామని, త్వరగా స్వగ్రామానికి తీసుకెళ్లాలని అధికారులను లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

గుడిసె, గడ్డివాము దగ్ధం


చొప్పదండి: మండల కేంద్రానికి చెందిన నూనె శేఖర్ వ్యవసాయ భూమిలో షార్ట్‌సర్క్యూట్ జరిగి, గడ్డివాము, గుడిసె, వ్యవసాయ సామగ్రి దగ్ధమయ్యాయి. బాధితుడి వివరాల ప్రకారం.. చొప్పదండిలోని రైస్‌మిల్లుల సమీపంలో శేఖర్ వ్యవసాయం చేస్తున్నాడు. అతని భూమిలో నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ వేయగా ఆదివారం షార్ట్‌సర్క్యూట్ జరిగి, మంటలు లేచాయి. పక్కనున్న గుడిసె, గడ్డివాము, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయి. విద్యుత్‌శాఖ అధికారులు లూజ్ వైర్లు సరిచేయకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని శేఖర్ ఆరోపించాడు.

కొత్తగూడెం తరలివెళ్లిన సీపీఐ శ్రేణులు



సభకు వెళ్తున్న సీపీఐ నాయకులు

గోదావరిఖని(రామగుండం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెంలో నిర్వహించిన ప్రజాగర్జన బహిరంగ సభకు గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో నాయకులు తరలివెళ్లారు. సింగరేణి కాంట్రాక్టు, ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు, కూరగాయల మార్కెట్ హమాలీ కార్మికులు, ఏఐటీయూసీ, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు రామగుండం రైల్వేస్టేషన్ నుంచి 22 బోగీల్లో వెళ్లారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, నాయకులు రంగు శ్రీనివాస్, కనకరాజ్, ఎంఏ.గౌస్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెం వెళ్తున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించిన ప్రజా గర్జన బహిరంగ సభకు ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ నుంచి ఏఐటీయూసీ నాయకులు తరలివెళ్లారు. ప్రజా సమస్యలు పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టేందుకు ఈ సభ ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. సంఘం సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాశ్, బ్రాంచి కార్యదర్శి రాజారత్నం, అన్నారావు, శ్యాంసన్, రామగుండం రీజియన్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సెక్రటరీ తిరుపతి, నాయకులు సాంబశివరావు, సురేష్, రమేశ్, రాజ్‌కుమార్, కిశోర్, మల్లేశ్ తదితరులున్నారు.


విద్యుదాఘాతంతో గేదెలు మృతి



వెంకటాపూర్ శివారులో మృతిచెందిన గేదెలు

మంథని: విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే.. మంథని మండలంలోని నాగెపల్లి పంచాయతీ పరిధి స్వర్ణపల్లిలో కుంభం బాపునకు చెందిన మూడు గేదెలు వెంకటాపూర్ సమీపంలో ఆదివారం మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై, చనిపోయినట్లు బాధితుడు తెలిపాడు. ఒక్కో గేదె విలువ రూ.50 వేలు ఉంటుందన్నాడు. అలాగే ముత్తారం మండలంలోని సీతంపేటలో గుండె బోయిన ప్రసాద్‌కు చెందిన గేదె గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి, విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు.

వడదెబ్బతో వృద్ధుడు..



రాజకొమురయ్య (ఫైల్)

సైదాపూర్: మండలంలోని గొడిశాల గ్రామానికి చెందిన చిట్యాల రాజకొమురయ్య(81) వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. రాజకొమురయ్య శనివారం వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యాడు. హుజూరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి నలుగురు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.